తోడు - నీడ

నమ్మిన ఆదర్శం ప్రకారం నడుచుకోవడాన్ని కరేజ్ ఆఫ్ కన్విక్షన్ అంటారు. ఒకటి నమ్మడం, నమ్మినదే ధైర్యంగా ఆచరించగలగడం స్థిరచిత్తులకే సాధ్యం.

అయితే ఏ పుట్టలో ఏముందో, ఏ రాయిని మొక్కితే ఏ మేలు ఒనగూడుతుందో అనే తత్వం ఈనాడు బాగా చదువుకున్న వాళ్లలో కూడా పాతుకుపోయింది. ఈ రెండోకోవకు చెందిన వాళ్లు డబ్బేతప్ప మిగతా విలువలని పాటించని శుష్కజీవులు.

ఉత్తమమైన ఆదర్శాన్ని ఎన్నుకొని, దానికి జీవితం అంకితం చేసుకోవడం గొప్ప విషయం. జీవితానికి ఒక లంగరు అంటూ లేకపోతే అంధకారం ఎదురౌతుంది.

ఈ ప్రపంచంలో రోజులు మారుతున్నాయా? లేక మనుషులు మారుతున్నారా? ఈ ప్రశ్న సగటు మానవుడి మదిలో తరచు మెదులుతూ ఉంటుంది. రోజులు ఎప్పటిలాగే ఉంటున్నాయి. మనుషులూ ఎప్పటిలాగానే ఉంటున్నారు. కాని మనుషులలోని పరోపకారబుద్ధి నశించి స్వార్థం పెరిగి పోవడంవలన జీవన పరిణామాల్లో కొట్టవచ్చిన మార్పు కనుపిస్తుంది. ఇది కటికసత్యమైనా, ప్రతీ ఒక్కడూ తానూ, ఈ సంఘంలో మనిషేనని అందరూ నడిచే బాటలో వెళ్లడంలో తప్పేముందని నెపాన్ని సంఘం మీద ఆపాదిస్తాడు. అయితే ఈ తత్వానికి అతీతులు లేరనికాదు.

ఆఫీసు గదిలోంచి బయటకొచ్చిన నా ముఖం వివర్ణమైంది. నా చేతిలోని బ్రీఫ్‌కేసు నాకే బరువనిపించింది. ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవలసివస్తుందని నేను ముందుగా వూహించలేదు. నాకు సలహా ఇచ్చినవాళ్ళు కూడా చూచాయగానైనా నన్ను హెచ్చరించలేదు. పైగా ప్రోత్సహించారు.

తను వెనుతిరిగి వచ్చేస్తూ ఉంటే "సాయంత్రం ఆరు గంటలు దాటిన తరువాత నా బసకు రండి, అక్కడ అన్ని విషయాలూ మాట్లాడుకుందాం" అంది. ఆమె.

ఇంకా ఏం వెళ్తాను? వెళ్లగలిగే ధైర్యం మాత్రం ఏది?

పది సంవత్సరాలు గతంలోనికి వెళ్లిపోయాను.

బి.ఎ. పాసైన తను అప్పుడే ఎల్.డి.సి.గా ఉద్యోగంలో చేరాడు. తల్లిదండ్రులు తన పెళ్లి చేయాలనుకున్నారు. ఈడెదిగిన ఆడపిల్ల గుండెలమీద కుంపటిలా వుంది. తన పెళ్ళికన్నా చెల్లెలి పెళ్ళి తల్లిదండ్రులకు ముఖ్యం. చెల్లిపెళ్ళి చేయాలంటే బోలెడు డబ్బు కావాలి. అందుకు తను సాధనం.

ఎన్నో సంబంధాలు వస్తున్నాయి. కొన్నిటిని పిల్ల నచ్చక ఇష్టపడలేదు. కొన్ని కట్నం దగ్గర పొంతన కుదరలేదు. చెల్లెలి పెళ్ళి సవ్యంగా జరగాలంటే తన కాబోయే మామగారు కనీసపక్షం పదిహేను వేలు కట్నం ఇవ్వాలి. అప్పటికీ కట్న కానుకల విషయంలో తనకు ఇదమిత్థంగా ఎలాంటి అభిప్రాయం లేదు. తండ్రిచాటు బిడ్డడు తన తండ్రి తన మంచినేగాని చెడును కాంక్షించడుగా?

ఆ సమయంలోనే రామకృష్ణరావుగారింటికి పెళ్ళి చూపులకు వెళ్ళాడు తను తల్లిదండ్రులతో పాటు.

అతనికి పేరు గుర్తుండిపోయింది. ఆ పిల్ల ముఖం కూడా గుర్తుండిపోయింది.

"అబ్బే! పదిహేను వేలకు ఒక్కపైసా కూడా తగ్గదు" తన తండ్రి దృఢంగా అన్నాడు.

అంతవరకు చూసిన పిల్లలందరికంటే ఆమె యోగ్యురాలిగా కనుపించింది తన కంటికి. అమ్మకూడా ఆ పిల్లను నచ్చుకున్నట్లు తమ గ్రహించాడు. ఇదీ కట్నం దగ్గర బెడిసి పోవలసిందేనా? తన తండ్రిది మంకుపట్టు. అతన్ని ఎదిరించే ధైర్యం లేదు. 'నాన్నా! వాళ్ళు ఇంతో అంతో ఇస్తామంటున్నారు. దానితో సంతృప్తి పడరాదూ!' అందా మనుకున్నాడు. తండ్రి తన వుద్దేశాన్ని పసికట్టనే కట్టాడు.

"రామకృష్ణారావుగారు! అసలు కట్నం తీసుకోవాలన్న కోరిక లేదు. కానైతే ఏం చెయ్యను? నాకూ ఒక ఆడపిల్లవుంది. దాని పెళ్ళి చేయాలి. మా దగ్గర బొక్కసాలలో డబ్బు లేదు. ఉన్నదేదో వీళ్ళ చదువులకి హారతి కర్పూరమైంది. అందుకే నేను ఇంత నిక్కచ్చిగా మాట్లాడుతున్నాను. అంతకన్నా ఎక్కువ కట్నం ఇస్తామన్న వాళ్ళు లేకపోలేదు. అయితే ఈడూ జోడూ కులం గోత్రం వంశ మర్యాదా కూడా చూసుకోవాలిగదా!"

అతను ఇంత ఖరాకండిగా చెప్పడం ఇది మొదటిమారు కాదు. ఇంతకుముందు మూడు సంబంధాలు కట్నందగ్గరే తప్పిపోయాయి.

తాను ఏమని కలుగజేసుకోగలడు?

తండ్రిని ఎదిరిస్తే 'నువ్వు కృతఘ్నుడివి. నీ ఆలనా పాలనా చేసి ఇంత చదివించాం. ఈనాడు రెక్కలొచ్చాయ్ ఎగిరిపోతావా? చెల్లెలిపెండ్లి బాధ్యత నీకు మాత్రంలేదా? దాన్ని కట్నం లేకుండా ఎవరైనా చేసుకుంటారా? ఆలోచించుకో' అని అంటాడు.

అందుకే తను తన మనోభావాలను వ్యక్తం చేయలేని అసమర్థుడు.

"మావాడు చాల మంచివాడు. నామాట కాదనడు. పెళ్ళికాకుండా ఉండిపోతాడా? చూస్తూ ఉండు ఇంతకంటే మంచి సంబంధమే చేస్తాను" ప్రతి మారూ తండ్రి అనే మాట.

తను అడకత్తెరలో పోకచెక్కై తండ్రిని ఎదిరించలేదు. ఆడపిల్లవాళ్ళను నొప్పించలేదు.

మామూలుగా అయితే వాళ్ళు మరి కొంతసేపు ప్రాధేయపడతారు. తమ కష్ట నిష్టూరాలు ఈతిబాధలు వల్లిస్తారు. లేదా ఇచ్చుకోగలిగిన స్థోమతవుంటే బేరం కుదరకపోతే సరే నంటారు.

ఈ సంబంధం కుదురుతుందా? లేక కట్నం దగ్గర కుదరని నాలుగవ సంబంధం ఔతుందా అని ఆలోచిస్తూ శిలాప్రతిమలా కూర్చుండిపోయాడు.

"ముకుందరావుగారూ! పధ్నాలుగు వేల తొమ్మిది వందల తొంభై తొమ్మిది రూపాయలు మా వాళ్ళు కట్నం ఇస్తారు. ప్లీజ్! ఒక్క రూపాయి తగ్గించండి!"

పెళ్ళికూతురే ఇలా అంటుందని చివరకు ఆమె తల్లితండ్రీ కూడా వూహించలేదు. ముందుగా ఆశ్చర్యంనుంచి తేరుకున్నది ఆమె తండ్రి.

"నీరజా! పెద్దవాళ్ళతో పరాచికాలు ఏమిటి?" అని ఆమెను మందలించి "క్షమించండి! అమ్మాయి తొందరపడి దురుసుగా ప్రవర్తించింది. మీరడిగినంతమేరకు మేం తూగలేం" అన్నారు రామకృష్ణారావుగారు.

తన తండ్రి కది అవమానంగా తోచింది. ఏం తను లోకవిరుద్ధంగా అడిగాడా? పదిహేను వేలు కట్నం అడిగాడు. చదువుండి ఉద్యోగం వున్న కుఱ్ఱవాడు, ఈ రోజుల్లో అది అంత అధికమా? ఎవరు మాత్రం కట్నం తీసుకోకుండా మడికట్టుకు కూర్చున్నారు? తమకందుబాటులో లేకుంటే సవ్యంగా ఆ మాట చెప్పవచ్చు. ఆడపిల్ల - తనను ధిక్కరిస్తుందా? ఈ రోజే ఇంతమాట అందే, రేపు ఆమె కోడలై వస్తే కాల్చుకుతినదూ?

అతను రామకృష్ణారావుగారు చెప్పబోయే ఎలాంటి సంజాయిషీని వినదలుచుకోలేదు. విసురునలేచి, కండువా దులుపుకొని "లే పార్వతీ! లేరా" అని తమతో అని విసవిసా నడిచారు. అతని వెనక తన తల్లీ, ఆమె ననుసరించి తనూ ఆలోచనారహితంగా నడిచారు.

"నాన్నా! నా పెళ్ళి కోసం మీరు దిగులెందుకు పడతారు? అసలు ఈనాటి యువత నిర్వీర్యమైంది. ఎన్నాళ్ళు కష్టపడితే అతను సంపాదించి పదిహేను వేలు నిలువచేయగలడు? అటువంటిది అప్పనంగా ఏ శ్రమా లేకుండా, ఏ పన్ను కట్టకుండా ఆడపిల్లను కన్న పాపానికి ఒక అయ్య తన కాళ్ళు కడిగి చేతిలో ఆ డబ్బు పోస్తూ వుంటే తను ఒక హీరో అనుకుంటున్నాడు. ఆ అల్పత్వాన్ని బాజాబజంత్రీలతో మెచ్చుకుంటున్నారు పెళ్ళికి వచ్చే మనుషులు. డబ్బే తప్ప మిగతా విలువలకు ప్రాధాన్యత నియ్యరు ఈ యుగపురుషులు."

ఆమె మాటలు కర్ణకఠోరంగా వినిపించినాయి నాకు. ఆమె అన్నది యథార్థమా? అది ఎంతటి కటికసత్యమైనా ఇతరులను తూలనాడే అధికారం ఆమె కెవరిచ్చారు?

తన తండ్రి కోరినది సబబుకాదా? ఈ ప్రపంచంలోని తదితర వ్యక్తులు చేస్తున్నట్లే నడుచుకుంటున్నట్లే తామూ నడవాలనుకుంటున్నారే! రామకృష్ణారావుగారు రేపు తన కుమారుడి

పెళ్లికి కట్నం తీసుకోరా? ఆ మాటకొస్తే అతని పెండ్లికి అతను మామగారు కట్నం ఇవ్వలేదా? గుడ్డొచ్చి పిల్లనెదిరించిందట. నిన్నగాక మొన్న జ్ఞానమొచ్చిన ఒక ఆడపిల్ల పెద్దలను వాళ్ళు పెట్టిన ఆచార వ్యవహారాలను ధిక్కరిస్తుందా? తను యథార్థాన్ని అంగీకరించలేకపోయాడు.

అయితే ఆ సంగతులను మరచిపోయాడు.

నిజమే! తన తండ్రి తన మెడలో బోర్డుకట్టి సంతలో పశువులా అమ్మచూపాడు. పరిస్థితులతో రాజీ పడడంకన్నా మరో మార్గాంతరం లేక తను తండ్రితో తెగతెంపులు చేసుకోలేదు. ఎంతైనా అతను తండ్రి. పితృదేవోభవ అంటారు. ఈనాడు ఈ మాత్రం చదువుకొని వుద్యోగం చేస్తున్నాడంటే అది అతని చలవవలన కాదూ? శ్రమపడి, తను తిన్నా తినకున్నా, అప్పులో సప్పులో చేసి వున్నవి తెగనమ్మి చదివించాడు. అతనికి విధేయుడై వుండడం తన కర్తవ్యం.

వేలంపాటలో తండ్రి అనుకున్నదానికన్నా అధికధరకే అమ్ముడు పోయాడు తను. అయినా ఎలాంటి న్యూనతను తను అనుభవించలేదు. సుజాత తనకు తగిన అర్ధాంగే అనిపించుకుంది.

కాలం దొర్లిపోతోంది. సంసారం అన్న తరువాత కష్టం సుఖం వుంటాయి. సగటు మనిషిలా ఆటుపోటులను భరిస్తూ రోజులు గడపసాగాడు.

అయితే నీరజ ప్రసంగం అప్పుడప్పుడు వచ్చేది.

"ఆ! ఆమెకు కట్నం అవాంఛనీయంగా తోచింది. ఇది మరీ విడ్డూరం. నీరజ ఆ రోజు అలా మిడిసిపడింది కాని ఎప్పుడో ఆమె చక్కా కట్నం ఇచ్చి మొగుడ్ని కొనుక్కొనే వుంటుంది. అసలునాకు మిమ్మల్ని, మీకు నన్నూ రాసిపెట్టాడు. అందుకే ఆ సంబంధం అలా తెగతెంపులైంది" సుజాత నవ్వుతూ అనేది.

నీరజ పట్టుదలగల మనిషి, కట్నం ఇచ్చి మాత్రం పెళ్ళి చేసుకొని వుండదు అని నాకు అనిపించినా, సుజాత మాటలను కొట్టిపారేయలేకపోయాను.

ఈ రోజు ఆ నీరజనే చూడవలసి వస్తుందని కలలోనైనా భావించలేదు. మా హెడ్డాఫీసులో పై అధికారి ఒక మహిళ అని విన్నాను కాని ఆమే నీరజ అని నేను భావించలేదు.

నాపాటి సర్వీసు వున్నవాళ్లు ఈనాడు హెడ్ గుమస్తాలయ్యారు. నా జూనియర్లు కూడా ప్రమోటయ్యారు. కాని నా ప్రమోషను ఆర్డరు రాలేదు. ఒకవంక చింత వేరొకవంక కారణం తెలియక బాధ.

కొందరు మిత్రులు సలహా యిచ్చారు పెద్దాఫీసులో పై అధికారిని కలవమని.

"ఒట్టి చేతులతో వెళ్లేవు. పై ఆఫీసరుగారికి తృణమో పణమో సమర్పించు. నీ ఫైలు ఎక్కడున్నా, ఎలాంటి అవాంతరాలున్నా చిటికెలో పని జరుగుతుంది" కొందరు సలహా యిచ్చారు.

కొన్ని వుదాహరణలు చూపించారు. వాళ్ళన్నది నిజమే. నా జూనియర్లు లంచాలిచ్చే ప్రమోషన్లు పొందినట్లు వినికిడి. అయినా ఈ రోజుల్లో లంచాలు సర్వ సామాన్యమైపోయాయి. నేను మడిగట్టుకు కూర్చుంటే రేపు నా జూనియర్లే నామీద అధికారం చూపిస్తారు.

ఇష్టం ఉన్నా లేకున్నా వాళ్ళ సలహాను పాటించవలసిందే.

ఎంత దాకా లంచం ఇవ్వాలి? కనీసం మూడు వేలైనా లేనిదే పని జరుగదు. పై అధికారితో పని, చిన్న చిన్న లంచాలకు అలాంటి వారు లొంగరు. నేను ఇతరుల ద్వారా తెలుసుకున్నాను.

మూడు వేలు. అదేం చిన్నమొత్తం కాదు. అయితే నా భావిజీవితాన్ని తలచి, భార్య మెడలోని ఒంటిపేట గొలుసును తాకట్టుపెట్టి ఆ డబ్బుతో పైఆఫీసుకి వెళ్లాను.

ఆమెను చూడగానే ' ఈమెను లోగడ ఎక్కడో చూసాను' అనిపించింది. పది సంవత్సరాల క్రితం నీరజ ఇంత ఒళ్లు చేసి లేదు. నాజూకుగా పీలగా వుండేది. ముఖంలో సిగ్గు, తపన వుండేవి. ఈవిడ ముఖం గంభీరంగా వుంది. అయితే నీరజను గుర్తించడం కష్టంకాదు. దిష్టిచుక్కమల్లే ఒక మచ్చ ఆమె నదుటమీద ఒక పక్కగా వుంది. ఆమెను పోల్చుకోగానే కించిత్తు ఆశ్చర్యపోయాను. ఆ తరువాత నేరం చేసిన వాడిలా భయపడ్డాను.

ఆ రోజు ఇంత డబ్బు కావాలని ఖరాకండి చేసాము. ఈ రోజు ఇంత ఇచ్చుకోవడానికి సిద్ధంగా వున్నాను అని చెప్పబోతున్నాను. కార్యాలు వేరైనా వ్యవహారం డబ్బుతోనే.

"చెప్పండి. ఏం పని?" అంది.

ఎలా మొదలెట్టాలి? ఏమని చెప్పాలి?

"నా ప్రమోషను గురించి తెలుసుకోవాలని వచ్చాను. రెండు సంవత్సరాల క్రితమే హెడ్ గుమస్తాగా ప్రమోషను కావలసింది. నా జూనియర్లు ఇద్దరు ముగ్గురు ప్రమోట్ అయ్యారు" అన్నాను.

నేను కలియడానికి గాను పంపిన చీటీని చూసింది. నా పూర్తి పేరు నేను రాయలేదు. ఇంగ్లీషు పొడి అక్షరాలు రాసాను. అందువలన ఆమె నన్ను గుర్తించే అవకాశాలు తక్కువ అనుకున్నాను. ఆమె ప్రవర్తనవలనా ఆమె నన్ను గుర్తించింది అనుకోలేదు.

"శేఖర్! మీ జూనియర్లు ప్రమోట్ అయ్యారా? మీరు ఏ కారణం చేత సూపర్ సీడ్ అయ్యారో మీకు తెలియదంటారా? మీలో ఏ లోపాలున్నాయో గ్రహించలేరా? ఏమైతేనేం అన్నీ వివరంగా రాసి పి.ఎ. కివ్వండి. నేను స్వయంగా చూస్తాను. పొరపాటైతే మీకు న్యాయం జరుగుతుంది." అంది.

నేను లంచం ప్రసక్తి మాటలాడలేక పోయాను. ఆమెను ప్రసన్నురాలిని చేసుకోవాలని ఈ బ్రీఫ్‌కేసులోని డబ్బు అందుకు ఎరగా చూపాలని అనుకున్నాను. నేనా ప్రస్తావన తెస్తే వికటించి నా వుద్యోగానికే ముప్పు వస్తుంది.

నిజమే ఆమె అన్నది అసత్యంగాదు. నాలుగేళ్లక్రితం నామీద ఆఫీసరు నిష్కారణంగానే నా వార్షిక ప్రతివేదనంలో ఒక ప్రతికూల అభియుక్తినిచ్చాడు. ఆ దోషమార్జన కోసమే ఈనాడు ఇలా పరుగెత్తుకువచ్చాను.

ఆమెకు నమస్కరించి వెనుతిరిగాను.

అదిగో అప్పుడే ఆమె సాయంత్రం తన బసకు రమ్మంది.

ఈమె నుంచి న్యాయం ఆశించడం అవివేకం.

పెళ్ళి చూపులలోనే తలవంపులు కలిగించేలా ప్రవర్తించింది. ఆమె కిప్పుడు అధికారమూ అవకాశమూ తోడైనాయి.

మానవుడి ఆశకు అధికారమూ అవకాశమూ తోడైతే నాయకుడౌతాడట. నాయకుడి విశిష్ట లక్షణాలేమిటో చెప్పమని వెనుకటి కెవరో చర్చిల్‌ని అడిగారట. రేపు ఏం జరుగుతుంది, పై వారం ఏం జరగబోతుంది. పై నెలలో ఏం జరగగలదు, పై సంవత్సరంలో ఏం జరిగేది ఖచ్చితంగా చెప్పగలనేర్పు నాయకుడికి వుంటుందట. అయితే అతను చెప్పినట్లు జరగని పక్షంలో, అలా ఎందుకు జరగలేదో చక్కగా విశదీకరించి నమ్మించగల మహత్తర శక్తి నాయకుడికి వుంటుందట. ఆమె ఇప్పుడు నాయకురాలు. తనకు ప్రమోషను ఎందుకు దొరకలేదో చక్కగా చెప్పి నమ్మించగల నెరజాణ.

ఒకరిమీద సదభిప్రాయం కలగకపోవడానికి సరియైన కారణం వుండాల్సిన పని లేదు. వారిలో మంచిని కాక చెడునే చూసే ప్రయత్నం చేస్తే సదభిప్రాయం కలగదు. నేను ఆమె దురుసుతనాన్ని, కఠినత్వాన్ని మాత్రమే గుర్తించాను. ఆనాడు ఈ కట్నం విషయంలో ఆమె ఆవేదన సగటున ప్రతీ గృహస్తూ ప్రతీ ఆడపిల్లా పడుతున్నదేనని ఆలోచించలేదు. బి.ఏ. పాసైన నేను ఈనాడు మామూలు గుమస్తాగా వుండి చిన్న ప్రమోషను దొరకలేదని వ్యథ చెందుతున్నాను. ఆమె నాకన్నా చిన్నది. నేను పెళ్లి చూపులకు వెళ్లినప్పుడు ఇంటరు మాత్రమే పాసైంది. అలాంటిది ఆమె ఎంత కృషి చేసి ఈ పదవిని చేపట్టిందో ఆలోచించలేదు.

పెళ్ళి - అక్షరాలు మాత్రం రెండే. కాని ప్రభావం కడుగొప్పది. ఈ శబ్దం కొందరికి శ్రవణానందకరంగా వుంటే మరికొందరికి కర్ణకఠోరంగా వుంటుంది. ఎందుకో మరి.

పెళ్ళి చేసుకొని సంసార సాగరంలో కొట్టుమిట్టాడేకంటే, తన కాళ్లమీద తాము నిలబడగలిగి ఒంటరిగా వుండలేరా అమ్మాయిలు? నీరజ అనాటి సవాలు ఇదే!

ఆ నీరజ ఈనాడు ఒక ఆఫీసరు. తప్పక ఏనాడో వివాహం చేసుకొని వుంటుంది. పిల్లా పాపా వుండేవుంటారు. తన సంసారాన్ని చూడమనేగా ఇంటికి రమ్మంది. 'ఒరేయ్! రాజశేఖరం నువ్వు ఆనాడు నన్ను కాదన్నావు. అది నామంచికే జరిగింది. ఈ రోజు నేనీ ఉచ్ఛస్థితికి వచ్చానంటే

అందుకు పరోక్షంగా నీవే కారణం' అని చెప్పదలచుకుందా?

అసలు ఆమె తనను గుర్తించిందా? ఛీ! తాను వెనుకటి విషయాలను గుర్తు తెచ్చుకొని ఏవేవో వూహిస్తున్నాడు. ఎంతైనా లంచం డబ్బు ఆఫీసులో తీసుకునే ధైర్యం ఎవరికైనా వుంటుందా? బహుశా ఆ విషయంగురించి మాట్లాడడానికి రమ్మందేమో!?

మన మనసుకి నచ్చిన విధంలో ఆలోచిస్తే ఆహ్లాదకరంగా వుంటుంది.

నేను ఆమె ఇంటికి వెళ్లాలనే అనుకున్నాను.

గేటుదగ్గర ఆడదర్వాను ఉంది.

"నీరజగారిని కలవడానికి వచ్చాను" అని చెప్పాను.

ఆమె ఒక నెంబరు చెప్పి వెళ్లమంది.

ఆ ఇల్లు ఏ ఒకరికో చెందిన బంగళా కాదు.

ఆమె చెప్పిన నెంబరుగల బ్లాకుకి వెళ్లాను.

బెల్ మ్రోగగానే నీరజ తలుపు తెరిచింది.

"వస్తారనే అనుకున్నాను" అంది.

కూర్చుందికి గాను కుర్చీ చూపింది. నౌకర్ని పిలిచి కాఫీలు తెమ్మంది.

"మీకు అన్యాయమే జరిగితే నేను సవరించే ప్రయత్నం చేస్తాను" అంది.

థాంక్స్ చెప్పాను.

"మిమ్మల్ని ఆఫీసులో చూడగానే నాకు వెనుకటి సంగతి గుర్తుకొచ్చింది. మిమ్మల్ని నేను పోల్చుకోగలిగాను. మీరు నన్ను పోల్చలేదా!?" అంది.

నా గొంతుకలో వెలక్కాయ పడినట్లైంది. పోల్చుకున్న విషయం చెప్పాను.

"అయినా మీరు వచ్చారంటే అనాటి నా దుడుకుతనాన్ని క్షమించినట్లే భావిస్తున్నాను."

నేను మాట్లాడలేదు.

"పెళ్ళి అయిందా అని అడగను. పిల్ల లెందరు? ముఖ్యంగా ఆడపిల్లలెందరు?"

నాకు అర్థమైంది. ఆమె నన్ను అవమానించడానికే పిలిచింది.

"కాఫీ తీసుకోండి" బిస్కట్ల ప్లేటూ, కాఫీ నా ముందు వుంచింది.

"స్త్రీలు ఒంటరిగా వుండలేరా? నామట్టుకు నాకు వుండగలరు అనిపించేది. ప్రతీ మనిషికి తోడు కావలసిందే. కాని తోడు కంటే ముఖ్యం నీడ. నీడ తరవాతనే తోడు. అయితే మావాళ్లు నాతో ఏకీభవించలేకపోయారు. కాని నేనే మొండికేశాను. చదువుకొనసాగించి ఈనాడు ఈ నీడను

సంపాదించాను. నాలా పెళ్ళికాని యువతుల్ని చదువుకి ప్రోత్సహించి వారిని కూడా వుద్యోగాల్లో చేరి ఒకనీడను సంపాదించుకోమన్నాను. నేటికి ఒక ఢజను మంది పెళ్ళికాని లేదా చేసుకోని యువతులం ఇక్కడ ఒకే గూట్లో వుంటున్నాం.

కట్న కానుకల లాంఛనాలను నేను కాదనను. శక్తికి మించి కట్నం ఇస్తే అది నేరంగా పరిగణిస్తాను. మాలా మరికొందరు యువతులు ఈ బలవంతపు కట్నాలను ఎదిరిస్తే రానున్న శకంలోనైనా అనుబంధాల తీరు మారుతుందని ఆశిస్తున్నాను" అంది.

ఆమె చెప్పిన యథార్థాన్ని నేను అంగీకరించగలనా? ఏమో!?

- ఆంధ్ర సచిత్రవారపత్రిక, 21.09.1990